ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 08-11-2026 సమయం: సాయంకాలం 8గం.30ని.లు

ముఖ్యాంశాలు

- దేశ అంతర్గత భద్రత బలంగా ఉంటేనే.. బయట శత్రువుల నుంచి ముప్పు ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- రాష్ట్రంలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది.
- అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రంలో పెద్ద ఎత్తున కొనసాతున్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.
- విశాఖపట్నంలో ఈ నెల 12, 13వ తేదీల్లో నిర్వహిస్తున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

==========

దేశ అంతర్గత భద్రత బలంగా ఉంటేనే.. బయట శత్రువుల నుంచి ముప్పు ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో భద్రతా సిబ్బందితో కలిసి దీపావళి పండగను ఆయన ఈరోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ... సరిహద్దుల్లో సైన్యం చేసే సేవలతో సమానంగా, దేశంలో అంతర్గత భద్రతను కాపాడే బలగాల పాత్ర కూడా కీలకమని చెప్పారు. ఒకప్పుడు దాదాపు 20 రాష్ట్రాల్లోని 230కి పైగా జిల్లాలు నక్సలిజం బారిన పడి ఉండేవారని గుర్తు చేశారు. దేశంలోని ప్రతి జిల్లాలోనూ నక్సలిజం ప్రభావం పూర్తిగా తొలగిపోయిందన్నారు. ఇది ఒక అసాధారణ విజయమని నరేంద్ర మోదీ పేర్కొంటూ...

(వాయిస్ 33 సెకన్లు)

==========

ఆంధ్రప్రదేశ్ లో పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఏర్పాట్లు చేస్తోంది. మొత్తం మూడు దశలలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలో మొత్తం 13 వేల 219 గ్రామ పంచాయతీలకు సంబంధించి మూడు విడతల్లో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం ఖరారు చేసింది. ఈ నెల 13వ తేదీన పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఎన్నికల సంఘం విడుదల చేయనుంది. ఈ నెల 26, 29వ తేదీలతో పాటు... డిసెంబర్ 2వ తేదీన పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 13వ తేదీన మొదటి దశకు నోటిఫికేషన్, రెండోదశకు 16వ తేదీన, మూడోదశకు 19వ తేదీన నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. తొలి విడత నామినేషన్లకు ఈ నెల 17 చివరి తేదీ, రెండో విడత నామినేషన్లకు ఈ నెల 20 చివరి గడువు, మూడో విడత నామినేషన్లకు ఈ నెల 23 చివరి తేదీగా పేర్కొంది.

= =

భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, పూర్వ ఉపప్రధాని ఎల్.కె. అద్వానీ దేశానికి చేసిన సేవలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గుర్తు చేసుకున్నారు. అద్వానీ 99వ జన్మదినం సందర్భంగా ఆయన భారతదేశానికి చేసిన సేవలు, రాజకీయ జీవితంలోని కీలక ఘట్టాలను వివరిస్తూ... నరేంద్ర మోదీ ప్రత్యేక వ్యాసం రాశారు. ఈ వ్యాసాన్ని ఈరోజు ఆయన తన సోషల్ మీడియా ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. దేశ విభజన సమయంలో ఎదురైన కష్టాల నుంచి బీజేపీ నిర్మాణం వరకు అద్వానీ సాగించిన ప్రస్థానాన్ని వివరించారు. ఆయన వ్యక్తిత్వంలోని సిద్ధాంత నిబద్ధత, మేధోపరమైన స్పష్టత, క్రమశిక్షణ, దేశం పట్ల అంకితభావాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు.

= =

దేశ నిర్మాణానికి పూర్వ ఉప ప్రధానమంత్రి ఎల్ కే అద్వానీ చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు. అద్వానీ జన్మదినం సందర్భంగా సామాజిక మాధ్యమం ద్వారా ఈ రోజు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. స్వతంత్ర భారత తొలితరం నాయకుల్లో ఒకరిగా దేశ అభివృద్ధి, ప్రగతిలో అద్వానీ కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తు చేశారు.

విరామం

= =

రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున సాగుతున్నాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... పనిచేసే ప్రభుత్వాలనే ప్రజలు విశ్వసించి గెలిపిస్తారని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలలో ఎన్డీయే కూటమి గెలుపు సాధించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రజలు ఇచ్చిన తీర్పుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని నిమ్మల రామానాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

= =

విశాఖపట్నంలో ఈ నెల 12, 13వ తేదీల్లో నిర్వహిస్తున్న 31వ సీఐఐ (CII) భాగస్వామ్య సదస్సుకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. స్థానిక ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా సీఐఐ సదస్సు జరగనుందని అధికార వర్గాలు తెలియచేశాయి. రాష్ట్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (CII), కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్తంగా ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నాయి. `కొత్త ప్రపంచ వ్యవస్థను నడిపించడం : వాణిజ్యం, సాంకేతికత, నమ్మకం` అనే ప్రధాన ఇతివృత్తంతో ఈ సదస్సు జరుగనుంది. సీఐఐ సదస్సుకు వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు సహా 1,250 మందికి పైగా దేశ, విదేశీ పారిశ్రామిక వేత్తలు హాజరుకానున్నారని అధికార వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర పారిశ్రామిక రంగాన్ని అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించడమే లక్ష్యంగా సీఐఐ సదస్సు నిర్వహిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

ఆయన ఈ సదస్సు ఏర్పాట్లను నిరంతరం సమీక్షిస్తున్నారు. ఈ సదస్సులో హరిత ఇంధనం, సెమీకండక్టర్లు, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (IT) డేటా సెంటర్లు, ఏరోస్పేస్ డిఫెన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆరు రంగాలపై ప్రత్యేకంగా చర్చలు జరపనున్నారు. ఈ సదస్సులో భాగంగా 400కు పైగా బిజినెస్-టు-బిజినెస్ (B2B) సమావేశాలు జరగనున్నాయని అధికార వర్గాలు తెలియచేశాయి.

==========

తిరుపతిలోని శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని `దీపావళి ఆస్థానా`న్ని ఈరోజు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీ పుండరీకవల్లి అమ్మవారి ఆలయం నుండి నూతన వస్త్రాలు, దీపాలను ఊరేగింపుగా తీసుకువచ్చి గోవిందరాజ స్వామి వారికి సమర్పించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక ఆస్థానం నిర్వహించారు.

==========

తిరుపతి జిల్లాలోని ప్రముఖ వాయులింగ క్షేత్రం శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో వైభవంగా కేదారీ గౌరీ వ్రతం ఈరోజు నిర్వహించారు. అమావాస్య ఘడియలు రావడంతో శ్రీకాళహస్తి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చారు. భక్తి శ్రద్ధలతో కేదారీ గౌరీ వ్రతంలో పాల్గొని నోములు నోచుకొని శ్రీ జ్ఞాన ప్రసూనాంబిక అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

==========

తిరుమలలో ఈ రోజు టోకెన్లు లేని భక్తులకు 15 గంటల్లో సర్వదర్శనం అవుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న స్వామివారిని 80 వేల 367 మంది భక్తులు దర్శించుకోగా.. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల హుండీకి 3 కోట్ల 34 లక్షల రూపాయల ఆదాయం వచ్చిందని అధికారులు చెప్పారు.

==========

జాతీయ న్యాయ సేవా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో విశాఖ నగరంలో న్యాయ అవగాహన కార్యక్రమాన్ని రేపు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉచిత న్యాయ సేవలు చట్టాలపై అవగాహన కార్యక్రమంలో వివరిస్తారు. ప్రతి పౌరుడికి న్యాయం పొందే హక్కు ఉందని, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఎవరూ న్యాయానికి దూరం కాకూడదన్న అంశం పైన ఈ సదస్సులో అవగాహన కల్పిస్తారు. సమాన న్యాయం, ఉచిత న్యాయ సహాయం, సైబర్ నేరాలు, బాలల రక్షణ, వివిధ చట్టాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు.

==========

పోలవరం జిల్లా వ్యాప్తంగా రేపు నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా చింతూరు డివిజన్ పరిధిలో ప్రతి నెల 11న నిర్వహించే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని కూడా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ డిసెంబర్ 2వ తేదీ వరకు అమల్లో ఉన్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధులు, ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

==========

ఒమన్‌లో ఈరోజు జరిగిన అండర్-19 ఆసియా కప్-2026 వన్డే క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా భారత్ పై 3 వికెట్ల తేడాతో పాకిస్థాన్ విజయం సాధించింది. తొలిత టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన భారత్ 208 పరుగులకే ఆలౌట్ అయింది. భారత ఓపెనర్ అర్జున్ రాజ్‌పుత్ 107 పరుగులతో అద్భుతమైన సెంచరీ సాధించాడు. అనంతరం 209 పరుగుల లక్ష్యాన్ని

పాకిస్థాన్.. 48.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. పాకిస్థాన్ బ్యాట్స్‌మెన్ హమ్జా జహూర్ 100 పరుగలతో రాణించి విజయాన్ని అందించాడు.

==========

==========